క్లుప్తంగా

విద్యార్థులకు బస్‌పాస్‌ల అందజేత



ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు బస్‌పాస్‌లు అందిస్తున్న ఉపాధ్యాయులు, ఆర్టీసీ సిబ్బంది

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌కు చదువు కోసం దూర ప్రాంతాల నుంచి వస్తున్న 200 మంది పేద విద్యార్థులకు సోమవారం ఉచితంగా ఆర్టీసీ బస్‌పాస్‌లను అందజేశారు. పాఠశాల ఇంగ్లీషు ఉపాధ్యాయుడు అరవ విస్సు సూచన మేరకు ద్రాక్షారామకు చెందిన అభిరుచి స్వీట్ స్టాల్ అధినేత చోడిశెట్టి వీరభద్రరావు అందజేసిన రూ.10 వేల ఆర్థిక సాయంతో విద్యార్థులకు ఈ బస్‌పాస్‌లను ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ రత్న పద్మావతి, ఆర్టీసీ ఉద్యోగులు వాకతిప్ప శ్రీనివాస్, ఐ.సూరిబాబు, జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు శ్రీమన్నారాయణ, గుణ్ణం సత్తిబాబు, పి.మెహర్ సుజాత, కోడి ప్రసాద్ తదితరుల చేతుల మీదుగా బస్‌పాస్‌లు పంపిణీ చేశారు.

సమయానుకూలంగా పొటాష్ వినియోగించాలి

కాజులూరు: వరి పంటపై పొటాష్ ఎరువును రైతులు సమయానుకూలంగా వినియోగించాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. సోమవారం మండలంలోని గొల్లపాలెంలో ఆయన రైతులతో మాట్లాడుతూ పంట దమ్ములో మొదటి దఫాగా 25 కేజీల పొటాష్ ఎరువును విధిగా వేయాల్సి ఉందన్నారు. రెండో దఫాగా వరిమొక్క చిరుపొట్ట దశలో మరో 25 కేజీల పొటాష్ ఎరువును వేసినట్లయితే ఓ మోస్తరు తేలికపాటి గాలులకు పంట పడిపోకుండా ఉండి అధిక దిగుబడులకు అవకాశం ఉంటుందన్నారు. వ్యవసాయ సేద్యంలో రైతులు ఎరువుల యాజమాన్య పద్ధతులను సక్రమంగా నిర్వహించినప్పుడే పైరు ఆరోగ్యంగా పెరిగి ఆశించిన దిగుబడులు సాధించగలుగుతారన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న కాపు ఐక్య వేదిక నాయకులు

కె.గంగవరం: ఇటీవల పంట పొలంలో పురుగు మందు పిచికారీ చేస్తూ అస్వస్థతకు గురై అనంతరం చికిత్స పొందుతూ మృతి చెందిన మండలంలోని సుందరపల్లికి చెందిన దామిశెట్టి వాసు కుటుంబ సభ్యులు భార్య దుర్గాదేవి, కుమార్తె సౌమ్య, కుమారుడు ప్రసాద్‌లకు రామచంద్రపురం నియోజకవర్గ కాపు ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఐక్య వేదిక నాయకులు, రామచంద్రపురం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మాగాపు అమ్మిరాజు, ఆళ్ల బుజ్జి, అల్లం రామకృష్ణ, కంచర్ల చక్రి, గ్రామ సర్పంచ్ సలాది తమ్మయ్య(సాధు), ఎంపీటీసీ తాడాల రాజు, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రహదారి అభివృద్ధి చేయండి



రాయవరం డీటీ జానకిరామయ్యకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

రాయవరం: మండలంలోని సోమేశ్వరంలో అధ్వానంగా ఉన్న రహదారిని అభివృద్ధి చేయాలని బీజేపీ నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. స్థానిక రైతులు పంట పొలాల్లోకి వెళ్లే రహదారులు అధ్వాన స్థితికి చేరుకున్నాయని, కనీసం నడవలేని పరిస్థితుల్లో ఉన్నాయన్నారు. నిత్యం రైతులు రాకపోకలకు వినియోగించే రహదారులను అభివృద్ధి చేయాలంటూ బీజేపీ నాయకులు చాత్రాతి జానకి రాంబాబు, శాకా దుర్గాప్రసాద్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నరాల రాంబాబు, చిరట్ల సుబ్బారావు, ఈరెళ్ల కృష్ణమూర్తి తదితరులు డిప్యూటీ తహసీల్దారు జానకిరామయ్యకు వినతిపత్రం అందజేశారు.

బాధిత కుటుంబ ఆర్థిక సాయం

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక గ్రామానికి చెందిన సాదా సుబ్రహ్మణం కుటుంబ సభ్యులకు జన సేవాదళ్ సభ్యులు ద్వారా ఆర్థిక సాయం చేశారు. ప్రమాదంలో తీవ్ర గాయాలు పాలైన సుబ్రహ్మణంను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ళ లీలాకృష్ణ సోమవారం పరామర్శించారు. సుబ్రహ్మణ్యం వైద్యానికి సుమారు రూ.10 లక్షలు ఖర్చు కాగా కోరుమిల్లి, అంగర తదితర గ్రామాలకు చెందిన సేవాదళ్ సభ్యులు రూ.ఒక లక్షా పది వేలు ఆర్థిక సాయం చేయడంపై లీలాకృష్ణ అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు లోవరాజు, తోరాటి శ్రీను రంకిరెడ్డి వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

అనుభవాలు నేర్వని కూటమి ప్రభుత్వం

- వరద సహాయ చర్యల్లో వైఎస్ జగన్ ప్రభుత్వమే మేలు
- వలంటీర్లను విస్మరించిన నేటి సర్కార్
- సహాయక చర్యల్లో నాణ్యతా లోపం



2022 జూలైలో అద్దంకివారిలంకకు కూరగాయలు తీసుకెళ్తున్న అధికారులు (ఫైల్)



కేదారిలంకలో వరద బాధితుని ఇంటికి వాటర్ బాటిల్ తీసుకెళ్తున్న వలంటీర్ రమేష్ (ఫైల్)

కపిలేశ్వరపురం: పుష్కరాల వేళ పుణ్యాన్ని ప్రసాదించే గోదారమ్మ అప్పుడప్పుడూ కన్నెర్ర చేస్తుంది. ఇటీవల ఉధృతంగా ప్రవహించిన వరద లంక గ్రామాలను చుట్టు ముట్టేసింది. ఏటా సంభవించే తీరే అయినా ప్రభుత్వం నుంచి సహాయక చర్యలు చేపట్టడంలో మాత్రం ఈ ఏడాది తీసికట్టు అయ్యింది. వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఐదేళ్లూ వరదలు సమీపిస్తుండగానే ముందస్తు సహాయక చర్యలు చేపట్టేది. వరద నీరు ముంచెత్తిన రోజుల్లో సైతం వలంటీర్, సచివాలయ వ్యవస్థలు ప్రధాన భూమికగా సహాయపడేవి. గోదావరిలో నీరు తగ్గుముఖం పడుతోంది. లంక గ్రామాల ప్రజలను కాపాడడంలో గత వైఎస్ జగన్, ప్రస్తుత కూటమి ప్రభుత్వాల తీరుపై ఈ కథనం.

రెండు నియోజకవర్గాల్లో ఇలా..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని పలు లంక గ్రామాలు పూర్తిగా గోదావరి నదిలో ఉన్నాయి. కపిలేశ్వరపురం మండలంలో అద్దంకివారిలంక, కేదారిలంక, కె.గంగవరం మండలంలో శేరిలంక మొత్తం మూడు గ్రామాలు ఏటా వరద ప్రభావానికి గురవుతాయి. అద్దంకివారిలంక గ్రామ పరిధిలో పల్లపులంక, అద్దంకివారిలంక, కోరుమిల్లి లంక, కేదారిలంక గ్రామ శివారులో వీధివారిలంక, కేదారిలంక, కపిలేశ్వరపురం గ్రామ పరిధిలో నారాయణలంకలు ప్రస్తుత వరదలకు తీవ్రంగా నష్టోయాయి. ధవళేశ్వరంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ కాగానే ఆయా గ్రామాల పరిధిలోని వ్యవసాయ క్షేత్రాలకు వరద తాకింది. రెండో ప్రమాద హెచ్చరిక రాగానే వ్యవసాయ క్షేత్రాలు మొత్తం ముంపు బారిన పడ్డాయి. పశువులను వ్యవసాయ క్షేత్రాల నుంచి గ్రామాలకు తరలించుకున్నారు.

సహాయక చర్యల్లో లోపం

ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వలంటీర్ల వ్యవస్థపై కక్ష కట్టినట్టు వ్యవహరించింది. వారికి జీతాలు ఇవ్వకుండా, విధులు కేటాయించకుండా పక్కన పెట్టింది. వలంటీర్లు లేని లోపం వరద సహాయక చర్యల్లో కొట్టొచ్చినట్టు కనిపించింది. గత వరదల్లో వలంటీర్లు పడవల్లో ఇంటింటికీ వెళ్లి వాటర్ ప్యాకెట్లు, కొవ్వొత్తులు, ఆహార పదార్థాలు అందజేశారు. వారు లేకపోవడంతో సచివాలయ, పంచాయతీ, రెవెన్యూ ఇతర ప్రభుత్వ అధికారులు, సిబ్బందిపై ఒత్తిడి పెరిగింది. వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 534.73 కిలోమీటర్ల పొడవునా ఉన్న ఏటిగట్లను 740 మంది వలంటీర్లు పర్యవేక్షించారు. 2022 జూలై, ఆగస్టులలో రికార్డు స్థాయిలో వరద గ్రామాలను చుట్టుముట్టినపుడు కూడా వలంటీర్లు ప్రభుత్వం అందించిన బియ్యం, నిత్యావసరాలు, ఆహారం, మంచినీరులను బాధితులకు పడవలపై అందించారు.

జగన్ హయాంలో ముందస్తు చర్యలిలా..

పటిష్ట వ్యవస్థలతో వైఎస్ జగన్ ప్రభుత్వం విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొంది. 2022, 2023లలో ముందస్తు ప్రణాళిక, చిత్తశుద్ధితో అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి వరదను సమర్థవంతంగా ఎదుర్కొంది. ప్రస్తుత వరద అంచనాలపై ఈ ఏడాది మే నెలలోనే సంబంధిత కార్యాచరణను రూపొందించింది. అందులో భాగంగా మే 16న ధవళేశ్వరంలో గోదావరి డెల్టా సిస్టమ్ సీఈ ఆర్.సతీష్‌కుమార్ ఇరిగేషన్ అధికారులతో ముందస్తు సమీక్ష జరిపారు. క్షేత్ర స్థాయి పరిస్థితులపై నివేదికలను రప్పించుకుని ప్రణాళికను రూపొందించింది. ఏటిగట్ల పరిరక్షణతో పాటు అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల వద్ద రక్షణ చర్యలు చేపట్టేది. గోదావరి గట్ల సమీపాన ఫ్లడ్ స్టోర్లలో తగిన సామాగ్రిని సమకూర్చింది.

పాడి పశువుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి...

2022 వరదల ఉధృతిని దృష్టిలో పెట్టుకుని వైఎస్ జగన్ ప్రభుత్వం 2023 వరదల్లో మరింత పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ఆ నాటికి జిల్లాలోని కపిలేశ్వరపురం, కె.గంగవరం, రాజోలు, సఖినేటిపల్లి, మలికిపురం మండలాల్లోని 72 గ్రామాల పరిధిలోని 125 లంక ప్రాంతాల్లో 24,673 ఆవులు, గేదెలు ఉన్నాయి. వాటిని ముందస్తుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించింది. పశువుల కోసం ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్లు ద్వారా 134 మెట్రిక్ టన్నుల ఎండుగడ్డి, 200 మెట్రిక్ టన్నుల సమీకృత దాణాను అందజేసింది.

వరద సేవలతో ఇప్పటికీ గుర్తింపు



గత ఐదేళ్ల కాలంలో వలంటీర్‌గా చేసిన వరద సహాయక చర్యలు నాకు ఇప్పటికీ గుర్తింపు ఒస్తున్నాయి. వరదనీటిలో చిక్కుకున్న బాధితులకు వాటర్ టిన్స్ తీసుకెళ్ళి ఇచ్చేవాడిని. సేవా దృక్పథంతో పనిచేశానన్న సంతృప్తి మిగిలింది.
– కాశిన రమేష్, వలంటీర్, కేదారిలంక

మండపేటలో మెగా వైద్య శిబిరం

- 320 మంది రోగులకు వైద్య పరీక్షలు
- ఉచితంగా మందుల పంపిణీ



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాము

మండపేట: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి పేర్కొన్నారు. ప్రముఖ ఎముకల వైద్య నిపుణుడు రాము ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం పక్కనే గల శ్రీసాయి ఆర్థో అండ్ ట్రామా కేర్ సెంటర్లో నిర్వహించిన ఈ వైద్య శిబిరాన్ని ప్రజాప్రతినిధులిద్దరూ ప్రారంభించారు. శిబిరంలో గుండె వ్యాధులకు సంబంధించి కాకినాడ ట్రస్ట్ హాస్పిటల్‌కు చెందిన కార్డియాలజిస్టు దుర్గాపవన్, లాప్రో స్కోపిక్ సర్జన్ డాక్టర్ నితిన్ నిమ్మలపూడి, గైనకాలజిస్ట్ డాక్టర్ కె.కన్యాకుమారి, సాధారణ వ్యాధులకు డాక్టర్ నెక్కంటి అభిలాష్ ఫిజియో థెరపిస్ట్ డాక్టర్ హనుమంతు వైద్య సేవలు అందించారు. మొత్తం 320 మంది రోగులు వైద్య సేవలు పొందినట్టు నిర్వాహకుడు డాక్టర్ రాము తెలిపారు. అవసరమైన రోగులకు ఎక్స్‌రే, షుగర్, ఈసీజీ, బీఎండీ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు కోన సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే గంగాధర్, సూరంపూడి సత్యప్రసాద్, టీడీపీ నాయకులు నల్లమిల్లి వీర్రెడ్డి, వుంగరాల రాంబాబు, పోస్టల్ అసిస్టెంట్ కొండపల్లి సూర్యనారాయణ, చెల్లూరి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలి



అనారోగ్యంతో బాధపడుతున్న చొల్లంగి ధనరాజును పరామర్శిస్తున్న సూర్యప్రకాశ్

కాజులూరు: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకూ కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను వెంటనే అమలు చేసి తన శిత్తశుద్ధిని చాటుకోవాలని వైఎస్సార్ సీపీ రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. కాజులూరు ముత్యాలమ్మ వేపచెట్టుపేటలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ సీనియర్ కార్యకర్త చొల్లంగి ధనరాజును సోమవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. పల్లిపాలెంలో ఇటీవల మృతి చెందిన బిళ్ళకుర్తి సత్యనారాయణరెడ్డి కుటుంబీకులను సూర్యప్రకాశ్ పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో ఆయన కార్యకర్తలను కలుసుకుని ప్రజాసమస్యలపై చర్చించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఒక క్యాలెండర్ ప్రకారం సమయానుకూలంగా పథకాలు అన్ని అమలయ్యేవని కూటమి ప్రభుత్వం శ్వేతపత్రం పేరుతో సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయకుండా కాలయాపన చేసేందుకు చూస్తుందన్నారు. మండల గ్రామాలకు చెందిన పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణ వీధులన్నీ శుభ్రంగా ఉండాలి

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ దుర్గారాణి
- మూడు వార్డుల్లో పర్యటన



మండపేట రైతు బజార్ పరిసరాలు పరిశీలిస్తున్న చైర్ పర్సన్ దుర్గారాణి

మండపేట: మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులూ ఎప్పుడు చూసినా శుభ్రంగా కనిపించాలని మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి శానిటరీ అధికారులకు సూచించారు. సోమవారం చైర్‌పర్సన్ దుర్గారాణి పట్టణంలోని పలు వార్డుల్లో కమిషనర్ బొడ్డేపల్లి రామును వెంట బెట్టుకుని పర్యటించారు. 24, 25, 26 వార్డుల్లోని గాంధీనగర్, సంఘం వుంతరోడ్డు, సైధిల్‌పేట తదితర ప్రాంతాలను సందర్శించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. గాంధీనగర్ షాదీఖానా వద్ద అపరిశుభ్ర వాతావరణం ఉండడాన్ని గుర్తించిన చైర్‌పర్సన్ పారిశుధ్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజులుగా ఇక్కడ ఉన్న చెత్త నిల్వలతో కంపు కొడుతుంటే చూస్తూ ఎలా ఉన్నారని ఆమె ప్రశ్నించారు. వెంటనే చెత్తను తరలించి బ్లీచింగ్ చల్లాలని శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా దుర్గారాణి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకుని శానిటేషన్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే తాగునీటి కుళాయిల ద్వారా సరఫరా అయ్యే నీటిని పరీక్షించారు. అనంతరం డంపింగ్ యార్డు వద్దకు వెళ్లి పరిశీలించారు. యార్డులోని చెత్త రోడ్డు మీదకు రాకుండా చూసుకోవాలన్నారు. చైర్‌పర్సన్ వెంట డీఈ శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు జొన్నపల్లి సత్తిబాబు, అమలదాసు రుద్రమూర్తి, అడబాల వీరబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్య, ప్రజారోగ్య సిబ్బంది సందక ఉమామహేశ్వరరావు, చంద్రు రామకృష్ణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

గోదావరి కోతపై రైతుల ఆందోళన



నదీకోతను నివారించాలంటూ ధర్నా చేస్తున్న రైతులు

మామిడికుదురు: గోదావరి కోత తీవ్రంగా ఉందని, దాని నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పాశర్లపూడి బాడవలో రైతులు సోమవారం ధర్నా చేశారు. వైనతేయ వారధి వద్ద నిరసన తెలిపారు. గోదావరి కోత నివారణకు గ్రోయన్లు, రివిట్‌మెంట్ నిర్మించాలని కోరారు. ఇటీవల వచ్చినగోదావరి వరదకు నదీకోత తీవ్రమైందని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.కోట్లు విలువైన భూములు నదీగర్భంలో కలసి పోయాయని, నెల నెలా ఆదాయాన్ని ఇచ్చే కొబ్బరి చెట్లు నదిలో పడిపోయాయని వాపోయారు. ఈ సమస్య పరిష్కారంపై తక్షణం ప్రభుత్వం స్పందించాలని రైతులు డిమాండ్ చేశారు. ధర్నాలో రైతులు తోరం నాగేంద్ర, మల్లాడి విష్ణు, నిమ్మల అప్పారావు, చవటపల్లి బులిబాబులు, మల్లాడి వీరపండు, పాలూరి సత్తిబాబు, పెమ్మాడి రామ్మూర్తి, మట్లాడి వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

స్టాపర్లను ఢీకొట్టిన మోటారు సైక్లిస్టు

అంబాజీపేట: ముక్కామల నాలుగు రోడ్ల సెంటర్‌లో పోలీసులు ఏర్పాటు చేసిన స్టాపర్లను ఓ మోటారు సైక్లిస్టు సోమవారం బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో మోటారు సైక్లిస్టుకు తీవ్ర గాయాలు కాగా అమలాపురం ఆస్పత్రికి 108లో తరలించారు. కాగా మోటారు సైక్లిస్టు వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

సాయం చేస్తున్నట్టు నటించి సొమ్ము స్వాహా

పి.గన్నవరం: స్థానిక యూనియన్ బ్యాంక్ ఏటీఎంలో నగదు తీసేందుకు సాయం చేస్తున్నట్టు నటించి ఇద్దరు వ్యక్తులు రూ.9 వేలు స్వాహా చేసిన ఘటన సోమవారం పి.గన్నవరంలో జరిగింది. మండలంలోని వై.కొత్తపల్లికి చెందిన తోరం నాగ వెంకట దుర్గాదేవికి స్థానిక యూనియన్ బ్యాంక్‌లో ఖాతా ఉంది. సోమవారం ఉదయం బ్యాంకు ఆవరణలో ఉన్న ఏటీఎంకు కుమారుడు ఫణీంద్ర గణేష్ కుమార్‌తో ఆమె వచ్చారు. వారు నగదు తీసుకునేందుకు ఇబ్బంది పడటంతో.. అక్కడే ఉన్న ఇద్దరు యువకులు సాయం చేసి రూ.5 వేలు తీసి ఇచ్చారు. ఈ క్రమంలో ఏటీఎంలో సాయం చేసిన గుర్తు తెలియని యువకులు దుర్గాదేవి కార్డు తీసుకుని, తమ వద్ద ఉన్న మరో కార్డు ఇచ్చి వెళ్లిపోయారు. 11 నిమిషాల అనంతరం గుర్తు తెలియని వ్యక్తులు వేరే ఏటీఎంకు వెళ్లి రూ.9 వేలు కాజేశారు. నగదు విత్‌డ్రా చేసినట్టు దుర్గాదేవి భర్త వద్ద ఉన్న సెల్‌కు మెసేజ్ వెళ్లడంతో వెంటనే అలెర్ట్ అయి కార్డు బ్లాక్ చేయించారు.

అతిథి గృహం అసాంఘిక నిలయం

- నాటు కాటన్ బస చేసిన గెస్ట్‌హౌస్
- నేడు అనైతిక కార్యక్రమాలకు కేంద్రం
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు



శిథిలావస్థకు చేరిన కాటన్ అతిథి గృహం


ఆత్రేయపురం: కాటన్ బ్యారేజీ నిర్మించే సమయంలో కాటన్ బస చేసిన అతిథి గృహంగా పేరు గాంచిన లొల్ల లాకుల వద్ద కాటన్ అతిథి గృహం నేడు శిథిలస్థితికి చేరుకుని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారింది. లొల్ల లాకుల వద్ద కాటన్ హయంలో నిర్మించిన అతిథి గృహం శిథిలస్థితికి చేరుకుంది. గత 25 ఏళ్ల క్రితం ఈ అతిథి గృహాన్ని ఆధునీకరించారు. ఈ అతిథి గృహంలో కొత్తపేట నియోజకవర్గంలో కొత్తపేట, ఆలమూరు, రావులపాలెం, ఆత్రేయపురం మండలాలకు చెందిన ఏ పార్టీ ప్రజా ప్రతినిధులైనా ఈ బంగ్లా ఆవరణలో సమావేశాలు నిర్వహించేవారు. అలనాడు మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు విశ్రాంతి తీసుకుని సమీక్షలు, సమావేశాలు నిర్వహించేవారు. రానురాను అతిథి గృహం వైపు ఎవరూ చూడకపోవడంతో రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలు విచ్చలవిడిగా సాగిపోతున్నాయి. మద్యం, పేకాట, వ్యభిచారం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఈ వసతి గృహం కేంద్రంగా మారడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయంలో ఆధునీకరణ పనుల్లో భాగంగా కొత్తపేట, ఆత్రేయపురం, రావులపాలెం, ఆలమూరు మండలాల్లో సుమారు రూ.400 కోట్లు మంజూరు చేశారు. లాకుల వ్యవస్థతో పాటు కాటన్ అతిథి గృహం నిర్మించాలని ఈ ప్రాంతానికి చెందిన రైతులు కోరుతున్నారు. లొల్ల లాకులు పర్యాటకులను ఎంతో ఆకర్షించడంతో అతిథి గృహం నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పర్యాటక ప్రియులు కోరుతున్నారు. అసాంఘిక కార్యకలాపాలు నిరోధించేందుకు రాత్రివేళల్లో పోలీసులు గస్తీ లేదా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

కఠినంగా వ్యవహరిస్తాం



లొల్లలాకులు ప్రాంతంలో రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు చేపడదాం. రాత్రివేళల్లో పోలీసు గస్తీ నిర్వహిస్తాం. మద్యం, జూదం, వ్యభిచారం నిర్వహించే వ్యక్తులు ఎంతటివారైనా ఉపేక్షించేంది లేదని ఆయన హెచ్చరించారు.
– శ్రీనివాస్, ఎస్సై, ఆత్రేయపురం మండలం

ప్రతిపాదనలు పంపించాం



లొల్లలాకుల ఆధునీకరణకు ప్రతిపాదనలు పంపాం. ఆమోదం లభించిన వెంటనే లాకులు వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు అతిథి గృహం నిర్మాణానికి చర్యలు చేపడతాం.
– పిల్లా సత్యనారాయణ, ఇరిగేషన్ ఏఈ

బాలిక వైద్యానికి రూ.52 వేల సాయం



బాలికకు సాయం అందిస్తున్న హెచ్‌ఎం సూర్యప్రకాశరావు

మామిడికుదురు: అరుదైన వ్యాధితో బాధ పడుతన్న అప్పనపల్లి అరుంధతీపేటకు చెందిన 13 ఏళ్ల బాలిక ఆకుమర్తి జ్యోతి వైద్య ఖర్చులకు దాతలు సోమవారం ముందుకు వచ్చారు. ఆమె కుటుంబానికి రూ.52 వేలు ఆర్థికసాయం అందించారు. బాలిక తండ్రి రమేష్‌తో కలిసి 1999–2000లో అప్పనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.50 వేల సహాయం అందించారు. స్కూల్ ప్రధానోపాధ్యాయులు బావరాజు సూర్యప్రకాశరావు రూ.2 వేలు సహాయం అందించారు. ఆ సహాయాన్ని జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద బాలిక జ్యోతితో పాటు ఆమె తండ్రి రమేష్, తల్లి శాంతికుమారికి అందించారు. దాతలను పలువురు స్థానికులు అభినందించారు. మానవతా దృక్పథంతో దాతలు సాయం అందించి బాలిక కుటుంబానికి అండగా నిలవాలని స్థానికులు కోరారు.

ఏఎస్సైపై దౌర్జన్యం చేసిన వ్యక్తిపై కేసు

అంబాజీపేట: విధులు నిర్వహిస్తున్న ఏఎస్సైపై దౌర్జన్యం చేసి విధులకు ఆటంకం కలిగించిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంగలకుర్రుకు చెందిన బూడిద విజయ్ అదే గ్రామానికి చెందిన ఓ అమ్మాయితో ఈ నెల 3 అర్ధరాత్రి ఆమె ఇంటి వద్ద మాట్లాడుతుండగా అర్ధరాత్రి వేళ మా ఇంటి వద్ద పనేంటని విజయ్‌ను ఆమె తల్లిదండ్రులు అడిగారన్నారు. దాంతో ఆమె తల్లితండ్రులపై విజయ్ ఘర్షణకు దిగాడన్నారు. అమ్మాయి తల్లిదండ్రులు అంబాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఏఎస్సై సూర్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకుని విచారిస్తున్నాడన్నారు. విధులు నిర్వహిస్తున్న ఏఎస్సైపైకి విజయ్ దురుసుగా వచ్చి దౌర్జన్యం చేయగా పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చామన్నారు. మద్యం మత్తులో పోలీస్ స్టేషన్‌లో ఉన్న అద్దాన్ని విజయ్ తలతో బలంగా ఢీ కొట్టాడన్నారు. ఏఎస్సై ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి అమలాపురం కోర్టుకి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

యువతికి పాము కాటు

పి.గన్నవరం: మండలంలోని నాగుల్లంక గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వరి (18) ఏళ్ల యువతి ఆదివారం రాత్రి తన ఇంటి వద్ద పాముకాటుకు గురైంది. దీంతో ఆమెను కుటుంబ సభ్యులు రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి అమలాపురం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతోంది.

తీర్మానం లేకుండా యానిమేటర్‌ను ఎలా నియమిస్తారు?

అంబాజీపేట: డ్వాక్రా సంఘ సభ్యుల తీర్మానాలు, అనుమతులు లేకుండా కొత్త యానిమేటర్‌ను ఎలా నియమిస్తారని ఏపీఎం గంగాధరరావును నిలదీశారు. కె.పెదపూడికి చెందిన ఉదయ, అశ్విని, సౌభాగ్యలక్ష్మి, దుర్గా, రాజరాజేశ్వరి, శ్రీరామ్, సాయిలీల డ్వాక్రా గ్రూపులతో పాటు మరో 23 డ్వాక్రా సంఘాల మహిళలు అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం మహిళలు విలేకరులతో మాట్లాడుతూ డ్వాక్రా సంఘ మహిళలకు తెలియకుండా ఏడాది క్రితం కొత్త యానిమేటర్‌ను ఏపీఎం నియమించారన్నారు. యానిమేటర్‌ను మారుస్తున్నామని సమావేశం ఏర్పాటు చేసి వివరిస్తే మాకు కొత్త యానిమేటర్ వద్దని, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న యానిమేటర్ విజయను కొనసాగించాలని ఎటువంటి తీర్మానాలు చేయకుండా అక్కడి నుండి బయటకు వచ్చామని మహిళలు చెప్పారు. పాత యానిమేటర్ కావాలని చెప్పినా మీరు ఎందుకు కొత్త యానిమేటరు గురించి మాట్లాడుతున్నారని నిజాలు చెప్పాలని, అబద్ధాలు చెప్పవద్దంటూ ఏపీఎంపై మహిళలు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త యానిమేటర్‌ను కొనసాగించకుంటే మీకు ఎటువంటి డ్వాక్రా లోన్లు రాకుండా చేస్తానని, ఏ సంక్షేమ పథకం అందదని హెచ్చరించారన్నారు. ఈ విషయంపై అడిగితే మీ డ్వాక్రా గ్రూపును రద్దు చేస్తామని బెదిరించారన్నారు. 11 నెలలుగా ఈ సమస్యను పరిష్కరించకుండా మాకు ఏదో ఒక కారణం చెప్పి ఏపీఎం తప్పించుకుంటున్నారని మహిళలు విమర్శించారు. స్త్రీ నిధిలో ఎటువంటి అప్పులు లేకపోయినప్పటికీ స్త్రీనిధి ఏజీఎం, ఏపీఓలు వచ్చి అప్పు కట్టాలని లేని పక్షంలో మీపై కేసులు నమోదు చేస్తామని, బెదిరించారని, దురుసుగా మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. మాకు పాత యానిమేటర్‌ను కొనసాగించాలని లేని పక్షంలో జిల్లా కలెక్టర్ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేస్తామని మహిళలు హెచ్చరించారు. దీనిపై ఏపీఎంను వివరణ కోరగా డ్వాక్రా సంఘాల సభ్యులకు కొత్త యానిమేటర్‌ను పరిచయం చేశామన్నారు. అలాగే త్వరలో డ్వాక్రా మహిళలతో సమావేశం ఏర్పాటు చేసిన సమస్యను పరిష్కరిస్తానన్నారు.